సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



గ్రామాల్లో సమీకృత వ్యవసాయం

సమీకృత వ్యవసాయంతో బంజరుభూములను సాగులోకి తెచ్చి సాగు విస్తీర్ణం పెంచాలనే లక్ష్యంతో ఎన్టీపీసీ సీఎస్సార్–సీడీ, నాబార్డు సంయుక్తంగా కార్యాచరణ చేపట్టింది. 8లో



ప్రజావాణితో సత్వర పరిష్కారం

ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి పరిష్కారం చూపాలని కలెక్టర్ సంగీత సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0/25.0

ఆకాశం మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అన్నంపెట్టే అవకాశం రావడం అదృష్టం



భోజనం వడ్డిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: తమకు అన్నం పెట్టేవారు ఉన్నారని అట్టడుగువర్గాలు తమను గుర్తించడం సంతోషంగా ఉందని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు పుట్ట లింగమ్మ ట్రస్టు ద్వారా వసతి, భోజన సౌకర్యాన్ని మంథని గ్రంథాలయ సమీపంలోని అద్దె గదిలో సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అన్నం పెట్టే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. నిరుపేద యువతకు తనవంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు కనీస సాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, స్థానిక ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

29న చలో హైదరాబాద్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముత్యంరావు

కాల్వశ్రీరాంపూర్: సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 29న మమాలీ కార్మికులు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి ముత్యం రావు తెలిపారు. మండలంలోని పెగడపల్లిలో సోమవారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. మామాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 55ఏళ్లు నిండిన వారికి రూ.5వేలు పింఛన్ చెల్లించాలని, ఇన్సూరెన్స్ పథకం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, మహేశ్, రమేశ్, అంజయ్య, మల్లేశ్, సమ్మయ్య, రాములు, రాజిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ప్రజాచైతన్య యాత్ర'ను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సీపీఐ ప్రజా చైతన్యయాత్రను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఆర్జీ–1 కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ కోరారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ.. పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు ఇంటింటికీ సీపీఐ.. ప్రజల వద్దకు సీపీఐ, బీజేపీని గద్దె దించండి.. దేశాన్ని రక్షించండి.. నినాదంతో ఈనెల 14 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యాత్ర ఈనెల 26న గోదావరిఖనికి చేరుకుంటుందని పేర్కొన్నారు. ప్రధానచౌరస్తాలో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. మాటేటి శంకర్, పడాల కనకరాజు, సిరిసిల్ల మల్లేశ్, జగన్, రాజయ్య, రమేష్ కుమార్ పాల్గొన్నారు.

సీఈఐర్‌తో ఐదు సెల్‌ఫోన్లు రికవరీ



బాధితులకు ఫోన్లు అప్పగిస్తున్న సీపీ

గోదావరిఖని: సీఈఐర్ అప్లికేషన్ ద్వారా ఐదు మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు సీపీ రెమా రాజేశ్వరి తెలిపారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు అధార్‌కార్డు, మొబైల్ నంబర్, ఐఎంఈఐ నంబర్లను సీఈఐఆర్ పోర్టల్‌లో www.ceir.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అయి వివరాలు అప్‌లోడ్ చేసి మొబైల్ ఫోన్లను బ్లాక్‌చేసి ట్రేస్‌డ్ డీటెయిల్స్‌లోకి వెళ్లి ఐదు ఫోన్‌లను రికవరీ చేశామన్నారు. సైబర్‌క్రైం ద్వారా ఐటీ సెల్ నుంచి సంబంధిత పోలీస్‌స్టేషన్లకు వివరాలు తెలిపి రికవరీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, ఏసీపీ ఎడ్ల మహేష్, జైపూర్ ఏసీపీ నరేందర్, మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, బెల్లంపల్లి ఏసీపీ సదయ్య పాల్గొన్నారు.







గింజకూడా మిగలలేదు..!

భారీ వర్షాలకు వరి నామరూపాల్లేకుండా పోయింది. వడగండ్ల ధాటికి గొలుసుకున్న గింజలు మొత్తం నేలరాలాయి. ఈదురుగాలులు, వడగండ్లు ఒకదానితో ఒకటి పోటీ పడ్డాయా.. అనే రీతిలో బీభత్సం సృష్టించి అన్నదాతలను నిలువునా ముంచాయి. ఎలిగేడు మండలం బురహన్‌మియాపేట్ గ్రామంలో కోతకొచ్చిన వరి.. ఇలా గింజలు లేకుండా పూర్తిగా రాలిపోయింది. మరోవైపు మూడురోజులుగా ఆకాశం ఉరుములు, మెరుపులతో అన్నదాతను కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. సాయంకాలమైతే చాలు ఏదో జరగబోతోంది అన్నట్లు ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుంటున్నాయి. సోమవారం సాయంకాలం ఆకాశం మేఘావృతమై రైతులను భయపెట్టింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

శుద్ధజలంపై సింగరేణి కసరత్తు

- టెండర్ దశలో పనులు
- రూ.20 కోట్లకు డైరెక్టర్ల గ్రీన్‌సిగ్నల్
- కార్మిక వాడలకు తీరనున్న నీటి కష్టాలు
- త్వరగా పనులు పూర్తి చేస్తాం: డైరెక్టర్(పా) బలరాం

'ఖని'లో ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ల ఏర్పాటు



నల్లాల ద్వారా సరఫరా అవుతున్న రంగునీళ్లు



గోదావరి నది వద్ద పరిస్థితి పరిశీలిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు మంచినీటి కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. మిషన్‌భగీరథ తరహాలో నీటిని శుద్ధి చేసే ప్రక్రియకు సింగరేణి శ్రీకారం చుట్టింది. గోదావరిఖనిలో ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ల ఏర్పాటు ద్వారా నీటిని శుద్ధి చేయనున్నారు. దీని కోసం రూ.20కోట్ల నిధులకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో కార్మిక వాడలకు త్వరలో పరిశుభ్రమైన నీరు అందనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు ఏర్పాటుతో ఏడాది పొడవునా గోదావరి నదిలో నీరు నిల్వ ఉండటంతో ప్రమాదకరంగా తయారవుతోంది. ఆ నీటిని తాగుతున్న కార్మిక కుటుంబాలు ఆసుపత్రుల పాలవుతున్నాయి. కొన్ని నెలలుగా నదిలో నీరు నిల్వ ఉండటానికితోడు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ డ్రైనేజీ నీరు నేరుగా గోదావరిలో కలుస్తుండటంతో పవిత్ర జలాలు విషపూరితంగా మారుతున్నాయి. సింగరేణి సంస్థ రామగుండం రీజియన్‌లోని సుమారు 20వేల కార్మిక కుటుంబాలకు గోదావరిఖని సమీపంలోని గోదావరినది తీరంలోని ఇన్‌టెక్‌వెల్ నుంచి ప్రతిరోజు 8మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తోంది. ఆర్జీ–1 ఏరియాకు 4.5 మిలియన్ గ్యాలన్లు, ఆర్జీ–2, 3 ఏరియాలకు 3.5మిలియన్ గ్యాలన్ల నీటిని పంపింగ్‌తో నల్లాల ద్వారా అందిస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఇదేవిధంగా నీటి సరఫరా కొనసాగుతోంది. ప్రతియేటా వర్షాకాలం ప్రారంభంలో భారీ వరద నదిలోకి రావడం మూలంగా నెలరోజులపాటు కార్మిక కుటుంబాలు తాగునీటి సమస్య ఉండేది. కాళేశ్వరం ప్రాజెక్టు ఏర్పాటుతో నిండుకుండలా గోదావరినది మారింది. దీనికితోడు డ్రైనేజీ నీరు నేరుగా నదిలో కలుస్తుండటంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. నదిలో ఉన్న నీరు రంగుమారి విషతుల్యమైంది. ఎండాకాలం ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. ఈ క్రమంలో సింగరేణి యాజమాన్యం కార్మిక కుటుంబాలకు పరిశుభ్రమైన నీరందించాలని నిర్ణయించింది. గతేడాది దీని కోసం రూ.20 కోట్లు మంజూరు చేసినా.. అనివార్య కారణాలతో ఆ నిధులు మళ్లిపోయాయి. దీంతో ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్లు ఏర్పాటు ప్రక్రియ ఆదిలోనే ఆగిపోయంది.

తాజాగా రూ.20కోట్లు..

సింగరేణి పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, సెంటినరీకాలనీలోని సుమారు 20వేల కుటుంబాలకు గోదావరినది నుంచి నీటిని నల్లాల ద్వారా యాజమాన్యం అందిస్తోంది. దీనికోసం గోదావరినది ఇంటిక్ వెల్ నుంచి పంపింగ్ ద్వారా నీటి సరఫరా కొనసాగుతోంది. ప్రస్తుతం ఈ నీటిని ఫిల్టర్‌బెడ్‌ల ద్వారా శుభ్రం చేస్తూ కార్మిక కుటుంబాలకు యాజమాన్యం అందిస్తున్నా.. రంగు నీళ్లు నేరుగా సరఫరా అవుతుండంతో కార్మిక కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ క్రమంలో ఆర్జీ–1 ఏరియాలో రూ.20కోట్లతో ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్లను ఏర్పాటు చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ప్రస్తుతం పనులు అవార్డ్, టెండరింగ్ దశలో కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. మరో 9నెలల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉందని అంటున్నారు.

శరవేగంగా ఫిల్టర్ల ఏర్పాటు



మిషన్ భగీరథ తరహాలో నీటిని శుద్ధి చేసేందుకు యాజమాన్యం రూ.20కోట్లు మంజూరు చేసింది. బోర్డ్ ఆఫ్‌డైరెక్టర్ల సమావేశంలో నిధులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ప్రస్తుతం వర్క్‌అవార్డ్, టెండర్ ప్రక్రియలో ఉంది. పనులు ప్రారంభమైతే తొమ్మిది నెలల్లో పూర్తవుతుంది. కార్మికుల సంక్షేమానికి రాజీపడే ప్రసక్తేలేదు.

– బలరాం, డైరెక్టర్(పా) సింగరేణి

'సహకారానికి' ఎదురుచూపు ..!

- జిల్లాకు మంజూరుకాని డీసీసీబీ
- ఉమ్మడి జిల్లా నుంచే రైతులకు సేవలు
- జిల్లాకో రీజినల్ బ్యాంకు ఏర్పాటుకు సన్నాహాలు



పెద్దపల్లిలోని కేడీసీసీ బ్యాంకు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి.. జిల్లాకేంద్రంగా ఏర్పడి ఆరేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ జిల్లా సహకార బ్యాంకు (డీసీసీబీ) ఏర్పాటుకు మాత్రం నోచుకోవడం లేదు. రైతులకు రుణాల పంపిణీ తదితర లావాదేవీలన్నీ ఇప్పటికీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే జరుగుతున్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసమంటూ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. అందుకు అనుగుణంగా అవసరమైన కార్యాలయాలు, అధికారులు, సిబ్బందిని నియమించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయనే వాదనలున్నాయి.

జిల్లా బ్యాంకు ఏర్పాటైతేనే...

జిల్లాలో కేంద్ర సహకార బ్యాంకు ఏర్పాటుచేస్తే ఈ ప్రాంత రైతులకు సత్వరమే రుణ మంజూరు ఇచ్చేందుకు వీలుంటుందని సహకార శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు. జిల్లా రైతాంగానికి అవసరమైన రుణాల మంజూరుకు ఉమ్మడి జిల్లా కేంద్రమైన కరీంనగర్ బ్యాంకు అధికారులే ఇవ్వాల్సి వస్తోంది. జిల్లాలోని సహకార సంఘాల సీఈఓలు తమ పరిధిలోని రైతులకు పంటరుణాల మంజూరుకు కరీంనగర్ కు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

రిజర్వ్‌బ్యాంకు అనుమతిస్తేనే...

కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో సహకార బ్యాంకులను ఏర్పాటు చేసేందుకు రిజర్వ్‌బ్యాంకు అనుమతి పొందాల్సి ఉంటుందని సహకార శాఖ అధికారులు చెబుతున్నారు. సహకార సంఘాల ద్వారా జరిగే లావాదేవీల వివరాలను రిజర్వ్ బ్యాంకుకు నివేదించి అనుమతి కోరాల్సి ఉంటుందంటున్నారు. అయితే ఉమ్మడి జిల్లాలోని ఇతర కార్యాలయాలను విభజించిన మాదిరిగానే జిల్లా కేంద్ర సహకారబ్యాంకును కూడా విభజించి కొత్త జిల్లాలకు బదలాయిస్తే ఆయా జిల్లాల రైతాంగానికి మేలు కలుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కొత్త సొసైటీల ఏర్పాటుపై రాని స్పష్టత

కేంద్రప్రభుత్వం గ్రామానికో సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని అంటుండగా.. రాష్ట్ర ప్రభుత్వం అలా సాధ్యపడదని, మరో 100 సొసైటీలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్న విషయం విదితమే. జిల్లాలో గతంలోనే కొత్తగా మరో 14 సొసైటీలను ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని అధికారులు ఉపసంహరించుకున్నారు. కొత్తగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తేనే ఎన్ని కొత్త సొసైటీలు ఏర్పాటవుతాయనే విషయంపై స్పష్టత రానుందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

జిల్లాకో రీజినల్‌బ్యాంకు ఏర్పాటు

జిల్లా కేంద్ర సహకారబ్యాంకు ఏర్పాటుకు నిబంధనలు అడ్డంకిగా ఉండడంతో కొత్తజిల్లాల రైతుల ఇబ్బందులు తీర్చేందుకు వీలుగా ప్రతి జిల్లాకో రీజినల్ బ్యాంకును ఏర్పాటు చేయాలని సహకార శాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ రీజియన్ బ్యాంకు ద్వారానే రుణాల మంజూరు తదితర నిర్ణయాలు తీసుకుని సత్వర సేవలను అందించేందుకు వీలుంటుందనే ఆలోచనకు అధికారులు వచ్చినట్లు తెలిసింది. మరికొద్ది నెలల్లో కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో రీజినల్ బ్యాంకులు ఏర్పాటయ్యేందుకు అవకాశాలున్నాయని అధికారవర్గాలు వివరించాయి.

ఉమ్మడి కరీంనగర్‌నుంచే



గతంలో మాదిరిగానే ఇప్పుడూ సహకార సంఘాల లావాదేవీలన్నీ ఉమ్మడి కరీంనగర్‌లోని జిల్లా సహకార బ్యాంకు నుంచే సాగుతున్నాయి. కొత్త జిల్లాల్లో రీజినల్ బ్యాంకులు ఏర్పాటు చేసి వాటిద్వారాఆ జిల్లాలో లావాదేవీలను నిర్వహించే అవకాశాలున్నాయి. కొత్త సంఘాల ఏర్పాటుకు ఇంకా ఎలాంటి ఆదేశాలూ అందలేదు.

– మైఖేల్ బోస్, జిల్లా సహకారశాఖ అధికారి

ఏ ఒక్కటీ వదలొద్దు

- 13 అసెంబ్లీ స్థానాలపై గులాబీ పార్టీ గురి
- 2014లో జగిత్యాల, 2018లో మంథని దూరం
- ఈసారి పాతజిల్లా క్లీన్‌స్వీప్ చేయాలని బీఆర్‌ఎస్ నిర్ణయం
- అభివృద్ధి వివరిస్తూనే బీజేపీపై ఎదురుదాడికి ప్రణాళికలు
- సోషల్ మీడియా సమగ్ర వినియోగంపై దృష్టి



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకోవాలని కారు పార్టీ ప్రణాళికలు రచిస్తోంది. టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి నేడు బీఆర్ఎస్ పార్టీగా రూపాంతరం చెందడం వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో విడదీయలేని అనుబంధం ఉంది. పార్టీ తొలి ఆవిర్భావ సభ నుంచి తెలంగాణ కోసం ఆమరణ నిరాహార దీక్ష వరకు.. ఇలా ఏది ప్రారంభించినా.. కరీంనగర్ నుంచి మొదలుపెట్టడం సీఎం కేసీఆర్‌కు సెంటిమెంటు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలైన రైతుబంధు, దళితబంధు పథకాలను కూడా కరీంనగర్ జిల్లా నుంచే ప్రారంభించడం గమనార్హం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 13 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. రాష్ట్రం ఆవిర్భవించాక రెండుసార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 2014లో జరిగిన ఎన్నికల్లో కరీంనగర్‌లో జగిత్యాల (జీవన్‌రెడ్డి) మినహా మిగిలిన అసెంబ్లీ స్థానాలు కారు పార్టీ కైవసం చేసుకుంది. 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లోనూ కారు పార్టీ మంథని (శ్రీధర్‌బాబు) మినహా 12 అసెంబ్లీ స్థానాల్లో విజయబావుటా ఎగురవేసింది. క్లీన్‌స్వీప్ చేయాలన్న ప్రతిసారి కాంగ్రెస్ కారు పార్టీ ఆశలపై నీళ్లు చల్లుతూ వస్తోంది. దీంతో ఈసారి ఎలాగైనా మొత్తం స్థానాలు సాధించాలని వ్యూహరచన చేస్తోంది. ఇందుకు 25న జరిగే నియోజకవర్గాల ప్లీనరీలను వేదికగా చేసుకుని కార్యకర్తలను కార్యోన్ముఖులను చేసేందుకు సిద్ధమవుతోంది. అందుకే.. అన్ని స్థానాల్లోనూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం చేసిన పనులను వివరించడం, బీజేపీ నిధులు, విధుల విషయంలో అడ్డుపడుతున్న తీరును ప్రజలకు తెలియజేయాలని పలు తీర్మానాలను, నిర్ణయాలను ఆమోదించేందుకు సిద్ధమవుతోంది.

కీలక తీర్మానాలివే..!

- వ్యవసాయం రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులు, కాళేశ్వరం తదితర ప్రాజెక్టులు.
- **సామాజిక భద్రత:** సమాజంలో పలువురికి అందజేస్తున్న పింఛన్లు.
- **మహిళా సాధికారత:** సంఘాలు–రుణాలు, పింఛన్లు, షాదీముబాకర్ తదితరాలు.
- **బీసీ సంక్షేమం:** గొర్రెల పంపిణీ, మత్స్యకారులు, చేనేత, గీత కారులు ఇతర కులవృత్తుల సంక్షేమం, రుణాలు మొదలైనవి.
- **దళితసంక్షేమం:** దళితబంధు, గురుకులాలు.
- **గిరిజన సంక్షేమం:** తండాల పంచాయతీలుగా అప్‌గ్రేడ్, రిజర్వేషన్లు, మిషన్ భగీరథ తాగునీరు
- **విద్య– ఉద్యోగం:** గురుకులాలు, మోడల్ స్కూళ్లు, మన ఊరు–మనబడి, హైదరాబాద్‌లో ఉపాధి అవకాశాల సృష్టి.
- పట్టణ ప్రగతి/పల్లె ప్రగతి.
- మైనార్టీ వెల్ఫేర్
- ధరల పెరుగుదలలో మోదీ వైఫల్యం.
- తెలంగాణపై వివక్ష
- విభజన హామీల అమలు
- సింగరేణి గనుల వేలం
- కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు, వేధింపులు తదితరాలపై కీలకమైన నేతలతోపాటు సాధారణ కార్యకర్తలను సైతం సిద్ధం చేసేందుకు 13 నియోజకవర్గాల్లో జరిగే ప్లీనరీ సమావేశాలను వేదికగా ఎంచుకుంది.

సోషల్ మీడియా వినియోగం..!

పార్టీ 13 స్థానాలను సాధించే క్రమంలో మొత్తం బాధ్యతలను జిల్లా మంత్రులు, పార్టీ జిల్లా ఇన్‌చార్జులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు అప్పగించింది. పక్కా వ్యూహం ప్రకారం.. బీజేపీ, కాంగ్రెస్ తీరును ఎండగడుతూ.. బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి పనులు, పూర్తి చేసిన పనులకు శంకుస్థాపనలను ప్రజలకు చేరే విధంగా వ్యవహరించాలని అధిష్టానం ఆదేశించింది. ఇందుకోసం ప్రధాన మీడియాతోపాటు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాలను సమగ్రంగా వినియోగించుకోవాలని, ఇందుకు సోషల్ మీడియా వారియర్‌లను పల్లెలు, మండలాలు, నియోజకవర్గాల వారీగా బలోపేతం చేయాలని ఆదేశించింది. పార్టీ చేపట్టిన కార్యక్రమాలతోపాటు, ప్రతిపక్షాల విమర్శలకు ఎదురుదాడి కూడా అంతే దూకుడుగా ఉండాలని, ఆరోపణలను ఎండగట్టేలా సోషల్ మీడియాను పూర్తిస్థాయిలో వాడుకోవాలని సూచించింది.

క్లుప్తంగా

'ఇండియన్'కు బెస్ట్ నేషనలిస్ట్ చైల్డ్ అవార్డు


అవార్డు అందుకుంటున్న ఇండియన్

గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖని గంగానగర్‌కు చెందిన సాంస్కృతిక సారధి కళాకారుడు లింగంపల్లి రాజేశ్ కుమారుడు ఇండియన్ అనే ఏడేళ్ల చిన్నారికి బెస్ట్ నేషనలిస్ట్ చైల్డ్ అవార్డు వరించింది. ఇటీవల హైదరాబాద్ సారధి స్టూడియోలో జరిగిన కార్యక్రమంలో మా అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సినీ నటుడు మురళీమోహన్, మాజీ మంత్రి బాబుమోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. రుద్ర స్టూడియోస్ సెకెండ్ ఈవెంట్ ఆధ్వర్యంలో మా అసోసియేషన్ ఫిలిం ఇండస్ట్రీ సమర్పణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తన కుమారుడి పేరుని ఇండియన్‌గా పెట్టడం హర్షనీయమని మురళీమోహన్ ప్రస్తావించారు. కార్యక్రమంలో ప్రొడ్యూసర్ అంబికాకృష్ణ, బిగ్‌బాస్ మేనేజర్ ఇరుగురాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై వీధి కుక్కల దాడి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణం చీకురాయి క్రాస్‌రోడ్ సమీపంలో వైఎస్సార్‌నగర్‌కు చెందిన అప్సియాకౌసైన్ అనే తొమ్మిదేళ్ల బాలికపై వీధికుక్కలు దాడి చేశాయి. కుక్కలు ఒక్కసారిగా పైన పడి కరవడంతో బాలిక చేతికి గాయమైంది. వెంటనే కుటుంబీకులు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు.

మాతంగి కాలనీలో మరో ఇద్దరిపై..

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ మాతంగికాలనీలో సోమవారం ద్విచక్ర వాహనదారులపై వీధి కుక్కలు దాడి చేయడంతో గోదావరిఖని రమేశ్‌నగర్‌కు చెందిన చందు, ఉమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు.

తడిసిన ధాన్యం.. నేలరాలిన మామిడి

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురియడంతో ధాన్యం తడిసిపోగా మామిడి కాయలు నేలరాలాయి. వరిధాన్యం కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యం కుప్పలపై ముందస్తుగా కవర్లు కప్పినా ఈదురు గాలులకు పైకి లేచిపోయి వర్షానికి ధాన్యం తడిసిముద్దయింది. గాలులకు మామిడికాయలు నేలరాలి తీవ్ర నష్టం జరిగింది. పంట నష్టంపై అంచనాలు తయారు చేసి పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

తాటిచెట్టుపై పిడుగు



మంథని: మంథని మండలం అడవిసోమన్‌పల్లి శివారులోని తాటిచెట్టుపై పిడుగుపడింది. భారీగా గాలివీస్తూ ఉరుములతో కూడిన పిడుగు చెట్టుపై పడడంతో మంటలు చెలరేగి చెట్టు కాలిపోయింది. సమీపంలో ఉన్న రైతులు భయాందోళనకు గురై పరుగులు తీశారు.

క్రీడలతో స్నేహభావం

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ చైర్మన్ మధుకర్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): క్రీడలు స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ అబ్దుల్ కలాం స్టేడియంలో 15 రోజుల పాటు నిర్వహించనున్న భారత జాగృతి కప్ నేషనల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఒక వైపు రాజకీయ చైతన్యం, మరోవైపు క్రీడలకు, కళలకు ప్రోత్సాహం అందించే దిశగా భారత జాగృతి కృషి చేయడం అభినందనీయమన్నారు. అంతకుముందు క్రీడకారులను పరిచయం చేసుకుని టోర్నమెంట్‌లో ప్రతిభను చాటుకోవాలని క్రీడకారులకు సూచించారు. ఈసందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులు మాట్లాడుతూ, ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 16 టీంలు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. సోమవారం మే 10వరకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో విజయం సాధించిన జట్టుకు మొదటి బహుమతిగా భారత జాగృతి కప్‌తో పాటు రూ.లక్షా యాభై వేలు, రెండో బహుమతి రూ.లక్ష అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో హైదరాబాద్, ఖమ్మం, వేములవాడ, కరీంనగర్, సిద్దిపేట్, నిజామాబాద్, ఆదిలాబాద్, గోదావరిఖని జట్లతో పాటు కేరళ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, నాగపూర్ జట్లు పాల్గొననున్నాయి. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, కమాన్‌పూర్ మార్కెట్ చైర్మన్ రాజలింగు, జాగృతి రాష్ట్ర సెక్రెటరీ కండెం సురేష్, మాజీ కార్పొరేటర్ స్టాలిన్ గౌడ్, నిర్వాహకులు మోహన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీపీసీ బాల భవన్ వార్షికోత్సవం



విద్యార్థులతో ఈడీ సునీల్‌కుమార్, అధికారులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండంలోని బాలభవన్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని కాకతీయ ఫంక్షన్ హాలులో జరిగిన వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల వర్ధమాన ప్రతిభను అభినందించారు. భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషాకుమార్ మాట్లాడుతూ, బాల భవన్ వార్షికోత్సవం ఉన్నత స్థాయికి ఎదగడానికి, ప్రకాశవంతంగా ప్రకాశించే సామర్థ్యాన్ని కలిగి ఉన్న చిన్న పిల్లల ప్రతిభను ప్రదర్శించడానికి ఒక అవకాశం అని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సెమీ క్లాసికల్ డ్యాన్స్, మోడరన్ డ్యాన్స్, తెలుగు ఫోక్ డ్యాన్స్, వెస్ట్రన్ డ్యాన్స్, బాల భవన్ చిన్నారుల స్కిట్, మైమ్ షోలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీజీఎం ప్రసేంజిత్‌పాల్, జనరల్ మేనేజర్లు లాఢ్, అతుల్ కమలాకర్ దేశాయ్, హరేరాంసింగ తపస్ సాహా, రవీంద్ర పటేల్, ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్, దీప్తి మహిళా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల పెంపునకు ఉద్యమించాలి


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): కాంట్రాక్టు కార్మికులు కనీస వేతనాల పెంపునకు మేడే స్ఫూర్తితో ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు గుజ్జుల సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్మిక వర్గానికి నేడు అందుతున్న వేతనాలతో జీవనం గడపడం కష్టంగా మారిందన్నారు. అనేక రంగాల కార్మికులకు నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల లోపు వేతనాలు ఉన్నాయని, దీంతో కుటుంబాల పోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాలను గాలికి వదిలి రేషన్ షాపుల ద్వారా ఇచ్చే సరుకులు తగ్గించడం, ఉచితాల పేరుతో సబ్సిడీల కోతలతో ప్రజావ్యతిరేక విధానాలను కొనసాగిస్తున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం 2021 పీఆర్సీ నివేదికలో కనీస వేతనం రూ.19 వేలుగా నిర్ణయించిందని, అన్‌స్కిల్డ్ వారికి రూ.18 వేలు ఉండేలా రూపొందించిన 21 నుంచి 25 జీవోలకు ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చి ఒకటిన్నర ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం ఎందుకు గెజిట్ ముద్రించలేదో చెప్పాలన్నారు. పీఆర్సీ నివేదిక ప్రకారం 30శాతం ఫిట్‌మెంట్ అన్ని రంగాల కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు అమలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు తోకల రమేష్, అడేపు శంకర్, గుమ్మడి వెంకన్న, కలవల రాయమల్లు, మల్లయ్య, తీగుట్ల రాములు, గొల్లపల్లి చంద్రయ్య, మార్త రాములు, ఇనుగాల రాజేశ్వర్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


ఓదెల: పిట్టలపల్లెలో నేలవాలిన పంటను పరిశీలిస్తున్న విజయరమణారావు

ఎలిగేడు: జిల్లాలో ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బుర్హాన్ మియాపేటలో ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి, బాధిత రైతులను ఓదార్చారు. అకాల వర్షాలకు మామిడి, మొక్కజొన్న, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, కొన్ని గ్రామాల్లో ఇళ్ల పైకప్పులు పూర్తిగా ధ్వంసమయ్యాయని, అయినా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి పరిహారం ఇప్పించాలనే సోయి కూడా లేకుండా పోయిందని విమర్శించారు. నష్టపోయిన ప్రతి రైతుకు ప్రతి ఎకరాకు రూ.30వేలను పరిహారంగా ప్రభుత్వం ఇచ్చి ఆదుకోవాలని పేర్కొన్నారు. మారం అనిల్‌రెడ్డి, గోదల వెంకట్‌రెడ్డి, బేతి రవీందర్‌రావు, చంద్రగిరి పరుశరాములు, గోదల సంజీవరెడ్డి, గోప్ప శ్రీనివాస్, పుల్యాల రవీందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం, పంటల పరిశీలన

ఓదెల: ఈదురుగాలులకు పంటలు దెబ్బతిన్నా.. పరిహారం చెల్లించటంలో ప్రభుత్వం విఫలమైందని విజయరమణారావు ఆరోపించారు. మండలంలోని గుండ్లపల్లె, పిట్టలపల్లెలో వర్షానికి తడిసిన ధాన్యం, పడిపోయిన పంట పొలాలు, కూలిన ఇళ్లను పరిశీలించారు. రైతుప్రభుత్వమని చెప్పుకుంటున్న బీఆర్ఎస్ పంటలు నష్టపోయినా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పిట్టలపల్లెలో వర్షానికి కూలిన ఇంటి బాధితుడు అనవేని రాజయ్యను పరామర్శించారు. మాజీ సర్పంచు పుప్పాల శంకర్, కాంగ్రెస్ నాయకులు చొప్పరి రాజయ్య, బైరి రవిగౌడ్, రెడ్డి రజనీకాంత్, పిట్టల సమ్మయ్య, యాదగిరి నరేశ్, నోముల సాగర్‌రెడ్డి, ఎండీ.రఫిక్, సమ్మయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రతినిధుల సభకు తరలిరండి

గోదావరిఖని: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 25న స్థానిక జీఎం కాలనీలో మైదానంలో రామగుండం నియోజకవర్గ ప్రతినిధుల సభ ఏర్పాటు చేసినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. అయితే అసంతృప్తి నేతలు మాత్రం సమావేశానికి దూరంగా ఉండాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కోలేటి దామోదర్‌తో సమావేశమయ్యారు.

శివుపల్లి పాఠశాలలో రిజల్ట్స్ డే

ఎలిగేడు: మండలంలోని శివుపల్లి ప్రభుత్వ పాఠశాలలో పీటీఎం, రిజల్ట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో అద్భుత ఫలితాలు సాధించిన ఐదుగురు విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. పిల్లలకు ప్రగతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుగ్యాల శ్వేత, ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణ, సీఆర్పీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల ఎత్తివేత వ్యాఖ్యలు అర్థరహితం


మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

రామగుండం: రాజకీయ లబ్ధికోసమే మైనార్టీల రిజర్వేషన్లు ఎత్తివేస్తామని ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేవెళ్ల బహిరంగ సభలో ప్రసంగించడం అర్థరహితమని పీసీసీ అధికార ప్రతినిధి జనక్‌ప్రసాద్ అన్నారు. సోమవారం అంతర్గాం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మైనార్టీల రిజర్వేషన్లు ఎత్తివేస్తే కేవలం ఓబీసీలకు మాత్రమే లబ్ధి జరుగుతుందని, ఎస్సీ రిజర్వేషన్లలో ఏలాంటి మార్పులు జరగవనే విషయాన్ని బీజేపీ శ్రేణులు గుర్తెరగాలని హితవు పలికారు. సింగరేణిలో డీఎంఎఫ్, సీఎస్ఆర్, షేప్ నిధుల వినియోగంపై కలెక్టర్లకు సంపూర్ణ అధికారాలు ఉండడంతో కేవలం ఆ నియోజకవర్గాలకే మళ్లిస్తున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గుర్తిస్తే బసంత్‌నగర్‌లో రెండు సిమెంట్ కంపెనీలను ఏర్పాటు చేస్తానన్నారు. 2022–23వ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి నుంచి డీఎంఎఫ్, సీఎస్ఆర్ నిధులు రూ.800 కోట్లు ఇతర ప్రాంతాల అభివృద్ధికి తరలించారని ఆరోపించారు. రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్ ఎవరికిచ్చినా పార్టీ అభ్యర్థి గెలుపునకు సంపూర్ణ సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు సందీప్, ప్రతినిధులు పూదరి సత్యగౌడ్, ధర్మపురి, వికాస్‌కుమార్, వడ్డెపల్లి దాస్, ఆరెపల్లి శ్రీనివాస్, ఎట్లం కృష్ణ, పోశయ్య, ఆంజనేయులు, అల్లాఉద్దీన్, చంద్రారెడ్డి, రాజయ్య, మహేశ్వర్, విజయ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ సంగీత


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి పరిష్కారం చూపాలని కలెక్టర్ సంగీత సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి 21 దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో 16 దరఖాస్తులు రెవెన్యూ సంబంధమైనవి. మిగతా 5 దరఖాస్తులు ఇతర శాఖలకు సంబంధించినవని అధికారులు పేర్కొన్నారు. పెద్దపల్లి మండలం మూలసాలకు చెందిన నిర్మలాదేవి తమ భూములకు పాసుబుక్కులిచ్చారని, ధరణిలో మరో వ్యక్తి పేరిట నమోదై ఉందని, దానిని సవరించాలని కోరారు. జూలపల్లి మండలం పెద్దాపూర్ శివారులోని రాజులగుట్ట వద్ద స్టోన్ క్రషర్ వద్ద పేలుళ్లతో పంటలు నష్టపోతున్నామని ఫిర్యాదు చేయగా.. ఈనెల 30లోగా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమీకృత వ్యవసాయ వ్యవస్థ

- జిల్లా పరిధిలో ఆరు క్లస్టర్ల ఏర్పాటు
- ప్రారంభించిన ఎన్టీపీసీ ఏజీఎం బిజోయ్‌కుమార్


పనులు ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ అధికారులు

రామగుండం: సమీకృత వ్యవసాయ సాగు విధానంతో బంజరుభూములను సాగులోకి తెచ్చి సాగు విస్తీర్ణం పెంచాలనే లక్ష్యంతో ఎన్టీపీసీ సీఎస్సార్–సీడీ, నాబార్డు సంయుక్తంగా కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగానే సోమవారం అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి లంబాడితండాలో ఈ వ్యవసాయ విధానానికి శ్రీకారం చుట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బిజోయ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో ఆరు క్లస్టర్ల గ్రామాలైన కన్నాల, రాణాపూర్, బామ్లానాయక్‌తండా, బ్రాహ్మణపల్లి తండా, జీడీనగర్, అంతర్గాంను గుర్తించామని, ఇందులో నీటి సంరక్షణ, ఎరువు నిర్వహణ, ఆహారభద్రత, సాధారణ రైతుల ఆదాయం, పంట ఉత్పాదకత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. వంద ఎకరాల కంటే ఎక్కువ బంజరు భూములను సాగుకు అనుకూలంగా మార్చే లక్ష్యంతో 20 మందికి ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ నుంచి ఎంపిక చేసిన చిన్న, సన్నకారు రైతులకు ఈ సమీకృత వ్యవస్థ బాసటగా నిలుస్తుందన్నారు. స్థానికంగా రిటైల్ మార్కెటింగ్ అనుసంధానంతో తాజా కూరగాయల ఉత్పత్తి ఏడాది పొడవునా జరిగేలా చూడడం, వీరికి రుణాల కోసం బ్యాంకులతో అనుసంధానం చేయడం, రైతుల పెట్టుబడి ఖర్చు తగ్గింపునకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ క్లస్టర్ కార్యాలయం ఏజీఎం పి.మనోహర్‌రెడ్డి, అంతర్గాం మండల వ్యవసాయ అధికారి భూక్య రాంబాబు, ఆరు క్లస్టర్ల రైతులు తదితరులున్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు



మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని స్పందన మోడల్ స్కూల్ వార్షికోత్సవాన్ని స్థానిక సీఆర్ క్లబ్ ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి, గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్ హాజరై విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు అందరిని అకట్టుకున్నాయి. స్థానిక శ్రీవాణి హైస్కూల్ ఆవరణంలో వార్షికోత్సవాన్ని పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, జక్కుల దామోదర్ రావు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కేశవ రావు, టంగుటూరి రాజయ్య, కార్పొరేటర్ శంకర్ నాయక్, పాఠశాల కరస్పాండెంట్ ఓదెలు, లక్ష్మణ్ కుమార్, హెచ్ఎం రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం


పరిశీలిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

రామగుండం: అంతర్గాం మండలం లింగాపూర్‌లో ఆదివారం అర్ధరాత్రి బట్టారి రవి అనే ఆటో డ్రైవర్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఈ ఘటనలో ఇంట్లో టీవీ, గ్రైండర్, బీరువాతో పాటు వంట సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతైంది. స్థానికుల వివరాలు.. నిరుపేద కుటుంబానికి చెందిన రవి ఆటోడ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు కూతుర్లు. పెద్ద కూతురుకు వివాహం కాగా మనవడి దగ్గరికి భార్య, చిన్నకూతురు కోరుట్లకు వెళ్లారు. రవి ఆదివారం ఆటో నడిపి రాత్రి ఇంటికి చేరుకునే సరికి ఇంట్లో నుంచి పొగ, కాలిపోయిన వాసన వస్తుండడంతో సమీప ఇంటి వారిని పిలిచి చూసేసరికి అప్పటికే విలువైన సామగ్రి కాలిపోయాయి. ఇందులో రూ.3,500, కట్టు బట్టలు పూర్తిగా దహనం కాగా మొత్తంగా రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో తహసీల్దార్ వేణుగోపాల్‌రావు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పంచనామా నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని పేర్కొన్నారు. అనంతరం అప్పటికప్పుడు 25 కేజీల బియ్యం, ఇతర నిత్యావసరాలను అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారులోని చందపల్లికి చెందిన చిటవేన శ్రీనివాస్ (47) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై రాజేశ్ కథనం ప్రకారం.. శ్రీనివాస్ ఆదివారం మద్యం మత్తులో క్రిమిసంహారక మందుతాగగా, స్థానికంగా ప్రాథమిక చికిత్స చేసి కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మండలంలోని గర్రెపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 1986–87 బ్యాచ్ విద్యార్థులు 36 ఏళ్ల తర్వాత సోమవారం కలుసుకున్నారు. గత స్మృతులను నెమరువేసుకొని మురిసిపోయారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు చార్లెస్, కట్ట సత్యనారాయణ, బాలయ్య, పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, వడ్కాపురం ఆంజనేయులు, ఆది వెంకటరమణారావు, పోలంపల్లి ఆంజనేయులు, రాజేశ్వర్‌రావు, దేవేందర్, సురేష్‌గౌడ్, అశోక్, సుజాత, శోభ, వసంత, నిర్మల, శైలజ, వనమాల తదితరులున్నారు.

అర్ధరాత్రి దీక్షా శిబిరాన్ని తొలగిస్తారా..?


నాయకులతో కలిసి నిరసన తెలుపుతున్న దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: బీసీ గణన, రిజర్వేషన్ల పెంపుకోసం జిల్లాకేంద్రంలోని బస్టాండ్ వద్ద శాంతియుతంగా రిలే దీక్షలు చేస్తున్న తమ శిబిరాన్ని అర్ధరాత్రి తొలగించడం ఏంటని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్టాండ్ కూడలి వద్ద పార్టీ నాయకులతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. బీసీలంతా ఏకం కావడాన్ని జీర్ణించుకోలేని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి 86 రోజులుగా సాగుతున్న శిబిరాన్ని పోలీసులతో తొలగింపజేశారని ఆరోపించారు. నాయకులు వెంకటేశ్, సవిత, శేషాద్రి, రియాజ్, అరుణ, శారద, మధు, నర్సయ్య, చంద్రశేఖర్ తదితరులున్నారు.